క్లుప్తంగా

షటిల్ బ్యాడ్మింటన్‌లో అక్కా చెల్లెళ్ల ప్రతిభ



అక్కా చెల్లెళ్లు ఆకాంక్ష, ఈషాను అభినందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

చీరాల రూరల్: నంద్యాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న ఆకాంక్ష, హైదరాబాదులో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న ఈషా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు. వీరు ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. మంగళవారం విశాఖ పట్టణంలో నిర్వహించిన ఫైనల్ పోటీలో మహిళల విభాగం డబుల్స్‌లో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన డబుల్స్ టీమును ఓడించి విజేతలుగా నిలిచారు. అక్కడే ఉండి మ్యాచ్‌లను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి అక్కా చెల్లెళ్లను అభినందించారు. ప్రైజ్ మనీ రూ. 3 లక్షలతో పాటు మెమోంటోలు, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించారు. ఇంతటి ఘనత సాధించిన అక్కా చెల్లెళ్లు ఆకాంక్ష, ఈషాలను క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకి: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ లోపుగా అర్హులైన వారు పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 21వ తేదీ పరిశీలన, 23న ఇంటర్వ్యూలు ఉంటాయి. 24న ఇంటిమేషన్ లెటర్లు అందజేస్తారు. 26వ తేదీన నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు. మండలంలోని వెంకటాపురం శింగరకొండ పాలెం, ధేనువకొండ, మోదేపల్లి, కుంకుపాడు, వెంపరాల గ్రామాల్లో ఒక్కో ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల వారు నిర్ణీత గడువు లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాల అర్బన్: చీరాల పట్టణంలోని పలు వార్డు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పార్థసారధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పది వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తులను ఈనెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తిప్పికొట్టాలి



సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

చీరాల రూరల్ : కాలం చెల్లిన ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తిప్పికొట్టాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజు పిలుపునిచ్చారు. ఏపీ మాల మహానాడు రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం కేంద్ర కార్యాలయంలో జాతీయ కన్వీనర్ చల్లా నరసింహరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. ఎస్సీ ఉపకులాల మధ్య చిచ్చు పెట్టి, అంబేడ్కర్ వాదాన్ని అడ్డుకునే జాతీయ స్థాయి వర్గీకరణ అంశాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. యడ్ల రాజేష్, తాతం వరదయ్య, కట్టా రూబేను, బొప్పన ముద్రం దామోదరం, పిడిది అప్పారావు, బౌతుల రాజేష్ బాబు, మేడికొండ రత్న బాబు, కత్తి శ్రీకాంత్, పాముల అనిల్, నక్కా జార్జ్, కాకి రవికుమార్ పాల్గొన్నారు.

తగ్గింపు జీవితాన్ని అవలంబించాలి



దేవుని వాక్య సందేశం అందిస్తున్న రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి

చీరాల రూరల్: ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవన విధానంలో తగ్గింపు జీవితాన్ని అవలంబించాలని రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి అన్నారు. 40 రోజులు పాటు నిర్వహించే క్రీస్తు శ్రమలకాల దినాలు బుధవారం రాత్రి చీరాల పట్టణంలోని అన్ని ప్రార్థన మందిరాల్లో ప్రారంభించారు. సెయింట్ మార్క్స్ లూథరన్ సెంటినరీ చర్చిలో రెవరెండ్ జోసఫ్ కేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్య సందేశాలు అందించారు. శ్రమల దినాల్లో క్రమ శిక్షణతో కూడిన ఉపవాస ప్రార్థనలు చేయాలని సూచించారు. తనను తాను తగ్గించుకొను వాడు క్రీస్తునందు హెచ్చింపు పొందుతారని ఆయన తన వాక్య సందేశంలో పేర్కొన్నారు. రెవరెండ్ పిల్లి దేవదాసు, చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘస్తులు పాల్గొన్నారు.

ఆసరాతో అక్కా చెల్లెమ్మలకు భరోసా



మార్టూరులో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఆమంచి కృష్ణ మోహన్



బొల్లాపల్లిలో సచివాలయం ప్రారంభిస్తున్న ఆమంచి తదితరులు

- చంద్రబాబు ఆడి తప్పిన మాటను నెరవేర్చిన జగనన్న
- డ్వాక్రా మహిళలకు 9.74 కోట్ల రూపాయల చెక్కు పంపిణీ చేసిన ఆమంచి

మార్టూరు: మహిళలు ఆర్థికంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నాడే అన్ని రంగాల్లో ముందంజ వేయగలుగుతారని ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకే అందించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణ మోహన్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం స్వయం సహాయక బృందాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని వాగ్దానం చేసి అనంతరం వారికి మొండి చేయి చూపించిన విషయాన్ని ఆమంచి గుర్తు చేశారు. నాటి పాదయాత్రలో మహిళల కోరిక మేరకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించిన వైఎస్ జగన్ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దశల వారీగా నాలుగు విడతల్లో రుణ మాఫీ చేసి ఇచ్చిన మాటను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని ఆమంచి అన్నారు. ప్రపంచమంతా కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్నప్పటికీ 25, 750 కోట్ల రూపాయల డ్వాక్రా రుణ మాఫీని నాలుగు దశల్లో పూర్తి చేసి జగనన్న మహిళల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆమంచి అన్నారు. మార్టూరు మండలంలోనే నాలుగు విడతల్లో 13,250 మంది గ్రూపు మహిళలకు షుమారు 40 కోట్ల రూపాయలు రుణ మాఫీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వయం సహాయక బృందాలకు నాలుగో విడత మంజూరైన 9.74 కోట్ల రూపాయల చెక్కును వారికి పంపిణీ చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలు స్థానిక నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ డ్వాక్రా సమావేశానికి ముందు ఆమంచి మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో 85 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సచివాలయం రైతు భరోసా కేంద్రం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గ్రామ సర్పంచ్ నార్నె సింగారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి, ఉప సర్పంచిలు భుక్యా సునీతా బాయి, కాకోలు రామారావు, ఎంపీపీ భుక్యా శాంతిబాయి, ఎంపీడీఓ జి. నితిన్, పర్చూరు ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మణాచారి, శ్రీనిధి మేనేజరు శ్రీనివాసరావు, ఏపీఎం రాజారత్నం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మండల కన్వీనరు పఠాన్ కాలేషా వలి, గర్నెపూడి రవిచంద్, బాబూ నాయక్, రాజా నాయక్, గడ్డం మస్తాన్ వలి, అట్లూరి సుకుందరావు, వెలుగు సిసిలు, వీఏఓలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతు



మద్దతు తెలియజేస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: వైఎస్సార్ సీపీతో పాటు, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి పట్ల పలు సంఘాలతోపాటు టీడీపీ నుంచి కూడా వచ్చి మద్దతు తెలియజేస్తున్నారు. తాజాగా గురువారం పట్టణంలోని మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆయను కలిసి తమ మద్దుతు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ గెలుపునకు తమ సహాయ సహకారాలు అందిస్తామని సమన్వయ కర్తతో వారు చెప్పారు. సంఘ అధ్యక్షుడు షేక్ జాన్ బాషా ఆధ్వర్యంలో సమన్వకర్తను కలిసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి మేలు చేసిన ప్రభుత్వం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. సంఘానికి నా మద్దతు, అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

వేటపాలెం: ప్రభుత్వం పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య అందుతుందని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కాయి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్సికోత్సవం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఆహుతులను ఆలరింపజేశాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భవనం భద్రిరెడి, జి. శ్రీనివాసరావు, కె. వీరాంజనేయులు, బుర్ల శివప్రసాద్, సుబ్బారావు, శివకృష్ణ, కట్టా సుబ్బారావు, పి. శామ్యూల్, పి. వెంకటేశ్వర్లు, కె. రత్న ప్రభ, బి. సాంబశివరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బైటమంజులూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జె.పంగులూరు: ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని భగవాన్ రాజుపాలెం, బైటమంజులూరు, రామకూరు, కొండమంజులూరు, కోటపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావుతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా ర్యాంప్‌లు, మంచినీరు, విద్యుత్, ఫ్యాన్లు సౌకర్యాలుండాలన్నారు. పోలింగ్ బూత్‌లకు తలుపులు, కిటికీలు లేని చోట వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని సీఐ కోరారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రజలతో సీఐ శివరాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజలకు ఆయుదం లాంటిదన్నారు. ఓటు హక్కు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకుంటే మంచి జరుగుతుందని తెలిపారు. డబ్బుకు, మద్యానికి ఏ ఇతర ప్రలోభాలకు లొంగి అవినీతి పరులకు ఓటు వేయకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్సై తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా ఉండాలని, ఎన్నికల్లో గొడవలకు పోకుండా ప్రజాస్వామ్యయుతంగా ఎవరి ఓటు వారు స్వేచ్ఛగా వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాలు కీలకం



మార్టూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ నారాయణ

బల్లికురవ: ఈ ఏడాది పదో తరగతి చదివేవిద్యార్థులకు ఫలితాలు అత్యంత కీలకమని, నెల రోజులు కష్టపడటంతో పాటు ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు సూచించారు. బుధవారం బల్లికురవలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయం, స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఇక్కడ సాధించిన ఫలితాలతోనే భవిష్యత్ నిర్దేశించుకోగలుగుతారన్నారు. 10/10 గ్రేడు సాధిస్తే ట్రిపుల్ ఐటీలో ఉచిత విద్య పొందగలుగుతారని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ నెల రోజులు సిలబస్ ప్రకారం ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లతోపాటు, విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు తీసుకొని తీర్చిదిద్దాలన్నారు. ఎంఈవో 1,2 వస్తం నాయక్, రమేష్‌బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ కె. సరళకుమారి, పాఠశాల హెచ్‌ఎం కె. హనుమంతరావు పాల్గొన్నారు.



కేజీబీవీలో మాట్లాడుతున్న డీఈఓ

మార్టూరు: బాపట్ల జిల్లా నూతన డీఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. నారాయణ బుధవారం మార్టూరులో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెదట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థుల ప్రతిభాపాఠవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక హెచ్‌బీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈఓ వస్రాం నాయక్, హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో స్వస్థత

- భవిత కేంద్రం బల్లికురవకు తరలింపు

బల్లికురవ: వైకల్యం కలిగిన 4 సంవత్సరాల్లోపు చిన్నారులతో నిత్య వ్యాయామం, ఫిజియోథెరపీ పరీక్షలతో స్వస్థత పొందవచ్చని ఎంఈవో 1,2, వస్తం నాయక్, రమేష్‌బాబు కోరారు. బుధవారం బల్లికురవ హెచ్‌ఈ పాఠశాలలో జరుగుతున్న ఫిజియోథెరపీ క్యాంపును పర్యవేక్షించారు. భవనాల కొరతతో రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ నిరహించాల్సిన భవిత కేంద్రాన్ని వైదనకు బదలాయించగా ఇటీవల బల్లికురవలో నాడు- నేడులో భవనాలు సమకూరటంతో భవిత కేంద్రాన్ని బల్లికురవ హెచ్‌ఈ పాఠశాలకు మార్చారు. వైకల్య చిన్నారులు భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని, నాగబాబు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ధర్మానందరావు

ఇంకొల్లు (చినగంజాం): ప్రముఖ వైద్యులు, ఇంకొల్లు రోటరీ క్లబ్ చార్టర్ అధ్యక్షుడు డాక్టర్ కొడాలి ధర్మానందరావు గంగవరంలోని మదర్ థెరెస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసరాలు, మిఠాయిలు, పండ్లు అందజేశారు. బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో కొడాలి ధర్మానందరావు తన కుమారుడు కొడాలి ప్రభాకర్ ప్రధమ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కందిపప్పు, బియ్యం, కూరగాయలను వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ చుండి సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మద్దినేని హనుమంతరావు, బీరం సుందరరావు, వత్సవాయి రాఘవరాజు, సోమేపల్లి రామ్మోహనరావు, గోరంట్ల నాగేశ్వరరావు, మొహిద్దీన్ బాషా, వై. కృష్ణమూర్తి, జరుబుల వేణు, ఆశ్రమ నిర్వాహకులు బొడ్డు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ బీరం సుందరరావు తన తల్లిదండ్రుల పేర ఆశ్రమానికి రూ. 5 వేల విరాళాన్ని వరప్రసాద్‌కు అందజేశారు. బీరం సుందరరావుని పలువురు అభినందించారు.

17 నుంచి కబడ్డీ పోటీలు

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఆహ్వానపు మహిళా కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసినట్లు పూర్వ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రకాశం, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుండి క్రీడాకారుల జట్లు పాల్గొంటాయని తెలిపారు. పోటీల అనంతరం అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నక్కల అర్జున్‌రావుకి పౌర సన్మానం చేయనున్నట్లు తెలిపారు.

అధికజన మహా సంకల్ప సభకు తరలిన అద్దంకి వాసులు



జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న చంద్ర మౌళి

అద్దంకి రూరల్: మాజీ కలెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ఆవరణలో బుధవారం జరగనున్న అధిక జన మహాసభకు అద్దంకి వాసులు తరలివెళ్లారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో 20 కార్లు, 3 తుఫాన్ వాహనాల్లో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బయలుదేరి వెళ్లారు. విశ్రాంత ఆర్జేడీ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు అభినందన సభ నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు

రాష్ట్ర స్థాయి విజేతలకు ఘన స్వాగతం

- కబడ్డీ క్రీడాకారులను స్వాగతించేందుకు కదలివచ్చిన ప్రజలు



క్రీడాకారులను ర్యాలీగా తీసుకెళుతున్న సచివాలయ ప్రజలు

చినగంజాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నమెంట్‌లో కబడ్డీ పురుషుల జట్టు రాష్ట్ర స్థాయిలో తన సత్తా చాటి విజయం సాధించి బుధవారం క్రీడాకారులు తమ స్వస్థలానికి తిరిగి వచ్చారు. కబడ్డీ పురుషుల ఫైనల్ పోటీ ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించగా కొత్తపాలెం సచివాలయం జట్టు నాగులాపురం 1 సచివాలయం(తిరుపతి) జట్టుతో పోటీ పడి 26–17 తో విజయం సాధించింది. కబడ్డీ పురుషుల జట్టులో ఆడిన క్రీడాకారులు విశాఖ పట్టణం నుంచి బుధవారం తిరిగి గ్రామానికి చేరుకోవడంతో స్థానిక సోపిరాల రైల్వేగేట్ సెంటర్ నుంచి సచివాలయం ప్రజలు ఘనంగా వారిని స్వాగతించారు. ముందుగా మండల స్థాయిలో మండల అభివృద్ధి అధికారి యూబీ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ఎన్. వేణుగోపాలకృష్ణమూర్తి, ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ఆమంచి వెంకట సుబ్బారావు, కొండూరి గోవింద్, పి. లక్ష్మీనారాయణ, ఏ. శ్రీరామ కృష్ణ, ఎస్. రామకృష్ణ తదితరులు వారికి స్వాగతం పలకడంతో పాటు అభినందనలు తెలియజేశారు. అనంతరం విజేతలైన క్రీడాకారులను వాహనంలో ఎక్కించి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చినగంజాం, కొత్తపాలెం గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పూలు చల్లుతూ, డీజే సౌండ్స్‌లతో ఊరేగింపుగా తీసుకొని వెళ్ళి సచివాలయ పరిధిలో ప్రత్యేక వేదికపై క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. సభకు మండల కన్వీనర్ ఎం. నాగేశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచి విజయం సాధించడం జిల్లాకే గర్వకారణం అని వక్తలు కొనియాడారు. జట్టులోని క్రీడాకారులు కుంచాల శ్రీకాంత్, కోట హరిప్రసాదరెడ్డి, ఆసోది సుబ్బారెడ్డి, దేశం సుబ్బారెడ్డి, గాలి లక్ష్మీనారాయణరెడ్డి, గాలి రామకృష్ణారెడ్డి, గుమ్మడి బాలాజీ, కాయల వెంకటేశ్వరరెడ్డి, మూలగాని భానుప్రకాష్ రెడ్డి, పల్లెబోయిన అనిల్ ప్రసాద్, పిట్టు బాలకృష్ణారెడ్డి, సోపర్ల మణిరెడ్డిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జట్టులో క్రీడాకారుడు పిట్టు బాలకృష్ణారెడ్డికి ప్రో కబడ్డీకి ఎంపిక కావడంతో అతనికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. సచివాలయం పరిధిలో మహిళలు ప్రత్యేకంగా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో రామలక్ష్మణ్ సోదరులు, బక్కా వెంకట రెడ్డి, బక్కా రంగారెడ్డి, వాటుపల్లి విజయ రామప్రసాద్, కేవీ కృష్ణారెడ్డి, రాజు శ్రీనివాసరెడ్డి, మూలగాని కోటిరెడ్డి, కేవీ రెడ్డి, బొడ్డు కృష్ణారెడ్డి, ఆట్ల వెంకటేశ్వరరెడ్డి, స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే గెలుపు



అద్దంకి నగరబాట కార్యక్రమంలో చిన్నారిని ముద్దాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ సమన్వయ కర్త పానెం చిన హనమిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో నగరబాట కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ఇంటింటికీ తిరిగి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అద్దంకి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి అద్దంకి ప్రజలు కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. గతంలో గెలిచిన ఎమ్మెల్యే అద్దంకికి ఏమి చేశాడో మీరే తెలుసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలన్నారు. అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇ–క్రాప్‌తో రైతులకు మేలు

- నేటితో ముగియనున్న గడువు



వేరుశనగ పంటను ఇ- క్రాప్‌లో నమోదు చేస్తున్న ఏఓ

వేటపాలెం: విత్తు నుంచి విక్రయం వరకూ అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలబడుతోంది. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోంది. ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటోంది. దీనిలో నమోదు కాకుంటే పంట అమ్ముకోవలనుకున్నా, బ్యాంకుల నుంచి రుణాలు పొందాలన్నా, వ్యవసాయ పరికరాలు తీసుకోవాలనుకున్నా, ఆఖరికి ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల బీమా దక్కించుకోవాలనుకున్నా సాధ్యపడదు. అందుకే అన్నదాతలంతా బహుళ ప్రయోజనాలున్న ఇ- క్రాప్ నమోదు చేయించు కోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోనూ వ్యవసాయ సిబ్బంది ఇ -క్రాప్ నమోదు చేస్తున్నారు. రైతు ఏయే సర్వే నెంబర్లలో ఎంతెంత విస్తీర్ణంలో, ఏయే పంటలు సాగు చేస్తున్నారో నమోదు చేస్తున్నారు. ఇ- క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతులకు సంబంధించిన మొబైల్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో డిజిటల్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ వెళుతుంది. రైతు ఈకేవైసీలో తన వేలిముద్రను వేయాల్సి ఉంటుంది. ఈ నెల 15వ తేదీ నాటికి నమోదు పూర్తి చేసేలా వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేటపాలెం మంలం పరిధిలోని 3,600 వేల ఎకరాల పంట భూములుండగా, వీటిలో 2,600 ఏకరాల్లో వీవీ పంటలు సాగు చేశారు. అందులో 2,520 ఏకరాల్లో పంటలను ఇ- క్రాప్‌లో నమోదు చేశారు.

> **నమోదు చేసుకోవాలి:**
> సాగు చేసిన ప్రతి రైతు పంటలను ఇ-క్రాప్‌లో తమ సాగు వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. దీని ఆధారంగానే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రాయితీలు అందుతాయి. నమోదులో ఎంలాంటి తప్పులకు అస్కారం లేకుండా చూసుకుంటున్నాం.
> ఐ. కాశీవిశ్వనాథ్, ఏఓ

బాలింతలు, గర్భిణులతో జాగ్రత్త

కారంచేడు: గ్రామాల్లోని బాలింతలు, హైరిస్క్ గర్భిణుల పట్ల ఏఎన్ఎంలు, ఆశలు అప్రమత్తంగా ఉండాలని కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ కె. జెస్సీరాణి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. 108 సాయంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సుఖ ప్రసవం వరకు వారిని పర్యవేక్షించాలన్నారు. రక్త హీనతతో బాధపడే వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారిని ముందుగానే ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. పీహెచ్‌ఎన్ సువర్ణజ్యోతి, హెచ్‌వీ వీరమ్మ, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.